క్లుప్తంగా

చట్టాల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలి

అశ్వాపురం: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన చట్టాల ఉల్లంఘనపై తగిన చర్యలు తీసుకోవాలని తుడుందెబ్బ రాష్ట్ర నాయకుడు అల్లెం కోటి డిమాండ్ చేశారు. అశ్వాపురంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలో రెవెన్యూ, ప్రభుత్వ, పోరంబోకు తదితర భూముల్లో గిరిజన చట్టాలను అతిక్రమించి గిరిజనేతరులు ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇటుక బట్టీలకు మట్టి, కర్ర తరలిస్తున్నారన్నారు. బాలకార్మికులు, పని గంటల హక్కుల సైతం ఉల్లంఘిస్తున్నారన్నారు. అక్రమ ఇటుక బట్టీల నిర్వహణపై అధికారులు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు పడిగ నాగేశ్వరరావు, తాటి మధు, కొమరం శ్రీను, ఈసం సూర్య, ఇమ్మడి నాగేశ్వరరావు, కొమరం సైదులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు సన్మానం



గజమాలతో సత్కరిస్తున్న భద్రాచలం వాసులు

భద్రాచలంటౌన్: భద్రాచలం సరిహద్దు ఏపీలోని ఎటపాక మండల పర్యటనకు వచ్చిన రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబును భద్రాచలం పట్టణ ప్రముఖుడు గాదె మాధవరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పోతుగుంట్ల బాలకృష్ణ, గౌతం, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు వితరణ

ములకలపల్లి: ములకలపల్లి అంబేడ్కర్‌నగర్‌కు చెందిన పలువురికి స్థానికవాసి, హైదరాబాద్‌లో నివసిస్తున్న మ్యూజిక్ డైరెక్టర్ గంటా రమేశ్ దుప్పట్లను వితరణగా అందజేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. గంటా వెంకటేశ్వర్లు, గద్దల రవి, గ్రామపెద్దలు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వినియోగించుకోవాలి

చండ్రుగొండ: పేద ప్రజల కోసం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని బీజేపీ అనుబంధ కిసాన్‌మోర్చా జిల్లా కార్యదర్శి నల్లమోతు రఘుపతిరావు కోరారు. మండలంలోని మద్దుకూరు, గుర్రాయిగూడెం గ్రామాల్లో 'మా సంకల్పం-వికసిత భారతం' ఆధ్వర్యంలో మంగళవారం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రచారం నిర్వహించారు. బడుగు బలహీన వర్గప్రజల కోసం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని రఘుపతిరావు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్దం వినోద్, ఎస్‌బీఐ మేనేజర్ రఘురాం, ఐకేపీ ఏపీఎం సంతోష్‌కుమార్, సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్లు నవీన్, పవన్ పాల్గొన్నారు.

పట్టాలు అందించాలి

దుమ్ముగూడెం: మండల వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఆదివాసీ రైతులకు చెందిన పట్టాలను వెంటనే అందించాలని ఏఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లూరు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. పెండింగ్ పాస్ పుస్తకాలు ఇప్పించాలని, వారసత్వంగా పట్టాలు చేయించి మంజూరు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో కొత్తపల్లి సర్పంచ్ గుండి వెంకటేష్, ఉపసర్పంచ్ రామచంద్రయ్య, ఆదివాసీ నాయకులు కోరం బొర్రయ్య, సోడి సాయి, సోడి రామారావు, కొత్తపల్లి బాధిత రైతులు పాల్గొన్నారు.

స్వెట్టర్లు పంపిణీ

దుమ్ముగూడెం: మండంలోని లక్ష్మీనగరం గ్రామంలోని కే రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ సరియం రాజమ్మ చేతుల మీదుగా మంగళవారం స్వెట్టర్లు, నైట్ డ్రస్సులను పంపిణీ చేశారు. భద్రాచలం ఐటీడీఏ నుంచి ఉచితంగా సరఫరా అయిన స్వెట్టర్లు, నైట్ డ్రస్సులను ఆమె అందజేశారు. 10వ తరగతి విద్యార్థులందరూ 10/10 జీపీఏ సాధించాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో హెచ్‌యం ధనసరి నాగమణి, వార్డెన్ జానకమ్మ, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన నాయకులు

బూర్గంపాడు: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రోహిత్‌రాజ్‌ను బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా నాయకులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. శాంతి భద్రతల పరిరక్షణకు అన్నివిధాల సహకారమందిస్తామని వారు ఎస్పీకి తెలియజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా నాయకులు కేవీ రమణ, గాడిద దామోదర్, ఇల్లందుల శేషు, సాడే వీరస్వామి, పాయం సింగరాజు ఉన్నారు.

దర్జాగా తోడేస్తున్నారు..

- నదులు, వాగుల నుంచి జోరుగా ఇసుక అక్రమ తరలింపు
- అభివృద్ధి పనులంటూ స్థానికులను బురిడీ కొట్టిస్తున్న వైనం



ఇసుక తరలింపుతో వాగులో ఏర్పడిన గోతులు



తాలిపేరు నదిలో నుంచి ఇసుకను తోడుతున్న దృశ్యం

చర్ల: మండలంలో ఇసుక అక్రమ రవాణాదారులు వాగులు, నదుల నుంచి దర్జాగా ఇసుకను తోడేస్తున్నారు. పగలు రాత్రి అనే తేడా లేకుండా ఇసుకను తోలుతున్న ఇసుక అక్రమ రవాణాదారులను స్థానికులు ప్రశ్నిస్తే ఇది అభివృద్ధి పనులకు తరలిస్తున్నామంటూ బురిడీ కొట్టిస్తున్నారు. ఈ అక్రమ రవాణాపై అధికారులకు సమాచారం అందుతున్నప్పటికీ అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై జనం విమర్శలు గుప్పిస్తున్నారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. చర్ల మండలంలోని గుంపెన్నగూడెం, చినమిడిసిలేరు, బీ కొత్తూరు, వద్దిపేట గ్రామాల సమీపాల్లో గల తాలిపేరు నది, కుదునూరు, ఆర్.కొత్తగూడెం, పెద్దిపల్లి, గొమ్ముగూడెం, మొగళ్లపల్లి, కొత్తపల్లి గ్రామాల సమీపాల్లో ఉన్న గోదావరి నదులతో పాటు కుదునూరు సమీపంలోని టపావాగుల నుంచి అక్రమార్కులు రోజూ ఇసుకను, మొరంను అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రి, పగలనక ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తూ భారీ పెత్తున శబ్దాలు చేస్తూ రహదార్లను ధ్వంసం చేస్తున్నారు. ఈ సందర్భాల్లో ఇదేంటని ప్రశ్నించే వారి పట్ల అక్రమ రవాణాదారులు దురుసుగా వ్యవహరిస్తూ దాడులు చేసే స్థాయికి కూడా వస్తున్నారంటూ పలువురు ఆరోపిస్తున్నారు. తమ అక్రమ ఇసుక రవాణాకు అడ్డురాకుండా ఉండేందుకు అక్రమార్కులు అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుంటున్నారని, అందువల్లే ఇంత దర్జాగా ఇసుక తరలించుకుపోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

నదులు, వాగుల్లో నుంచి పెద్ద ఎత్తున ఇసుకను తరలిస్తుండడంతో వాగులు, నదులు బావులను తలపిస్తున్నాయి. తాగునీటి కోసం నదులు, వాగుల్లోకి వెళ్తున్న మూగజీవాలు వాటిలో పడుతూ అతికష్టం మీద వాటిల్లో నుంచి బయటకు వస్తున్నాయి. అక్రమ ఇసుక రవానా జోరుగా సాగుతుండగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. గతంలో మన ఇసుక మన వాహనం పేరుతో తాలిపేరు నది నుంచి ఇసుకను తరలించుకునేందుకు ఏర్పాట్లు చేయగా దాని ద్వారా ప్రభుత్వానికి కొంత ఆదాయం సమకూరేది. ఆ తరహాలో కొంత కాలం ఇసుక రవాణా జరుగగా ప్రభుత్వానికి భారీగానే ఆదాయం వచ్చింది. కొంత కాలం ఈ తరహాలో ఇసుక రవాణా జరిగినప్పటికీ అక్రమ ఇసుక రవాణాదారులు అప్పటి అధికారులు ఒక్కటయ్యి దానిని పక్కకు నెట్టేశారు. దీంతో ప్రభుత్వానికి చేరాల్సిన ఇసుక ఆదాయం అధికారులు, ప్రజాప్రతినిధుల జేబుల్లోకి చేరుతోందని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇకనైనా అధికారులు చర్ల మండలంలో కొనసాగుతున్న అక్రమ ఇసుక రవాణా వ్యవహారంపై దృష్టిసారించాలని పలువురు కోరుతున్నారు.

అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేస్తాం..



చర్ల మండలంలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్ట వేస్తాం. వాగులు, నదుల నుంచి ఇసుక తరలిస్తున్నార్న సమాచారం అందుతోంది. నిఘా టీంలను ఏర్పాటు చేసి ఇసుక రవాణా చేస్తున్న వారిని గుర్తిస్తాం. వాహనాలను సీజ్ చేసి అక్రమ రవాణాదారులపై కేసులు నమోదు చేస్తాం.

– భరణిబాబు, డిప్యూటీ తహసీల్దార్

రేడియం స్టిక్కర్లు తప్పనిసరి



భద్రాచలంఅర్బన్: స్టిక్కర్లు అంటించాల్సిన ప్రదేశాన్ని సూచిస్తున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంఅర్బన్: ఏఎస్పీ పరితోష్ పంకజ్ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం స్థానిక చెక్‌పోస్ట్ వద్ద నిబంధనలు పాటించనచి 25 ట్రాక్టర్లను పట్టుకున్నారు. వాటన్నిటికీ వెనుక వైపున రేడియం స్టిక్కర్లు వేయించారు. సంబంధితన డ్రైవర్లకు బ్రిడ్జి సెంటర్ వద్ద అవగాహన సదస్సు ఏర్పాటు చేసి ఏఎస్పీ మాట్లాడారు. రాత్రివేళల్లో ఆగిఉన్న భారీ వాహనాలు కనిపించక వెనుకనుంచి వచ్చే వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారని, దీనిని నివారించేందుకు వాహన వెనుక భాగంలో రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ట్రాక్టర్, లారీ, ఇతర వాహనదారులు ఆయా స్టిక్కర్లను స్థానిక ఆర్టీఓ కార్యాలయం వద్ద పొందవచ్చని తెలిపారు. రానున్న 15 రోజుల వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి స్టిక్కర్లు లేని వాహనాలను అదుపులోకి తీసుకుంటామన్నారు. పరిమితికి మించి వాహనాల్లో వస్తువులను, జామాయిల్ కర్ర లోడ్‌లను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో భద్రాచలం టౌన్ సిఐ నాగరాజు రెడ్డి, ఎస్ఐ పీవీఎన్ రావు, ట్రాఫిక్, టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని ట్రాక్టర్, ఇతర వాహన యజమానులు తమ వాహనాలకు రేడియం స్టిక్కర్లు అంటించాలని సీఐ దోమల రమేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల కాలంలో ట్రాక్టర్ ట్రక్కులను ఢీకొని రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ట్రాక్టర్లు, ఇతర వాహనదారుల యజమానులు ఇంజన్, ట్రక్కులకు ఇండికేటర్లు, రేడియం స్టిక్కర్లను వెనుక భాగంలో అంటించవలసిందిగా సూచించారు. అలాగే ట్రక్కులను రోడ్డు పక్కన నిలుపవద్దని, లేదంటే కేసులు నమోదు చేయాల్సివస్తుందని హెచ్చరించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

దమ్మపేట: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, సీఐటీయు నాయకులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన కార్మికులు, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండల విద్యాశాఖ అధికారిణి కీసర లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు పిట్టల అర్జున్ మాట్లాడుతూ... గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను వెంటనే చెల్లించి, వారికి పదివేల రూపాయల గౌరవ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిల్లులు చెల్లింపులు లేని కారణంగా కార్మికుల కుటుంబ పోషణ కష్టతరంగా మారిందని అన్నారు. కార్యక్రమంలో ఈశ్వరమ్మ, జ్యోతి, సరోజిని, నాగమణి, సీత తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం క్రమం తప్పకుండా అందించాలి

అన్నపురెడ్డిపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు క్రమం తప్పకుండ పోషకాహారం అందించాలని సీడీపీఓ నిర్మలాజ్యోతి సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించి, రికార్డులను పరిశీలించారు. పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. ప్రతి నెలా 5 సంవత్సరాల లోపు పిల్లల ఎత్తు, బరువులను కొలిచి, పోషణ్ ట్రాకర్, ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లో ఆన్‌లైన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ అరుణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సీడీపీఓ నిర్మలాజ్యోతి

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మణుగూరురూరల్: వైద్యపరీక్షలు చేస్తున్న సింగరేణి డాక్టర్లు

మణుగూరురూరల్: సింగరేణి ప్రాజెక్టు ప్రభావిత గ్రామాల్లో, పరిసర గ్రామాల్లో సామాజిక బాధ్యతలో భాగంగా ఏరియా యాజమాన్యం నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సింగరేణి ఏరియా ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ ఎస్.రవికుమార్ తెలిపారు. మంగళవారం ఏరియాలోని ఆదివాసీ గిరిజన గ్రామమైన బుగ్గలోని ప్రభుత్వ పాఠశాలలో సింగరేణి సేవ సమితి, సింగరేణి వైద్య,ఆరోగ్య విభాగం ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో గ్రామానికి చెందిన 65 మందికి సింగరేణి డాక్టర్ రవికుమార్ వైద్యపరీక్షలు చేసి నివారణ మందులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు నివారణకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, జ్వరాలు సోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సింగరేణి డాక్టర్ స్పందన, సింగరేణి ఆస్పత్రి స్టాఫ్ నర్స్ వనజ, సిబ్బంది కృష్ణవేణి, శ్రీకాంత్, సేవ సమితి కో ఆర్డినేటర్ వెంకటమారేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తూరుబాకలో హెల్త్‌క్యాంప్

దుమ్ముగూడెం: మండలంలోని తూరుబాక గ్రామంలో వైఆర్‌జీ కేర్ లింక్ వర్క్స్ ఆధ్వర్యంలో మంగళవారం హెల్త్‌క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో ప్రజలకు హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కల్పించిన అనంతరం హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భూక్యా చంద్, సంస్థ సూపర్‌వైజర్ మధుబాబు, లింక్ వర్కర్ జరీనా, రాణి, వరలక్ష్మి, ఏఎన్ఎంలు నాగమణి, పద్మ, ఆశా వర్కర్‌లు బుల్లమ్మ, అంగన్‌వాడీ టీచర్స్ విజయనిర్మల, వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆధ్వర్యంలో వనభోజనాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ డిపో ఆవరణలో ఉద్యోగులు, కార్మికులు మంగళవారం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ బి.రామారావు మాట్లాడుతూ.. విధి నిర్వహనలో ఆర్టీసీ ఉద్యోగులు ఎంతో ఒత్తిడికిలోనై ఉంటారని, అందరినీ ఒకచోట కలిపి సరదాగా గడపాలనే ఉద్దేశంతో వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించిన్నట్లు తెలిపారు. అలాగే భద్రాచలం డిపో జనవరి 9, 1981 ప్రారంభించి నేటి 42 ఏళ్లు పూర్తి కావడంతో కేక్ కట్ చేశారు. అనంతరం రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగులను సన్మానించి, ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ గౌతమి, అధికారులు, ఉగ్యోగులు పాల్గొన్నారు.

ఆహారం పంపిణీ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో అబ్దుల్ కలామ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని భద్రాచలం సబ్ జైల్ సూపరింటెండెంట్ ఉపేంద్ర ప్రారంభించి మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులు వైద్యం పూర్తి అయ్యే వరకు ఇక్కడే ఉండాల్సిన పరిస్థితి. ఈ క్రమంలో రోగులతో వచ్చే వారికి ప్రతి నెల ఉచితంగా ఆహారం అందించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు మస్తాన్, ఉస్మాన్, ఖలీల్, ఇమాన్, అమీర్, పాషా, బాబాజీ, సాధిక్ పాషా, వెంకట్, సుధాకర్ పాల్గొన్నారు.

ధనుర్మాస పూజలు

చండ్రుగొండ: మండలకేంద్రం చండ్రుగొండలోని వేణుగోపాల స్వామి ఆలయంలో మంగళవారం ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. గోదాదేవి అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ అర్చకులు బోడెం వెంకన్నశాస్త్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో వ్యాపారి కుక్కడపు హరిబాబు దంపతులు పీటలపై కూర్చున్నారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అక్షింతల పంపిణీ

ములకలపల్లి: మండలపరిధిలోని కమలాపురం జీపీ కేంద్రంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో మంగళవారం అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, పురవీధుల్లో ప్రదర్శన చేశారు. అనంతరం వీధుల్లో ర్యాలీ చేపట్టి ఇంటింటికీ అక్షింతలు అందజేశారు. ఎంపీపీ మట్ల నాగమణి, సర్పంచ్ గొల్ల పెంటయ్య, వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు డాక్టర్ కారంపూడి సత్యనారాయణరాజు, కార్యదర్శి గొడ్ల రాజు, కీసరి వీరభద్రం, గ్రామపెద్దలు బాల అప్పారావు, గొగ్గెల ఆదినారాయణ, మట్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు ఎత్తివేయాలి

అశ్వాపురం: బెల్ట్‌షాపులు ఎత్తివేయాలని, సారాను నిషేధించాలని మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చెందిన మహిళలు మంగళవారం అశ్వాపురం పోలీస్‌లకు విన్నవించారు. గ్రామానికి చెందిన మహిళలు మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి గ్రామంలో సారా, బెల్ట్‌షాపులతో మద్యం సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని బెల్ట్‌షాపులు ఎత్తివేయాలని సారాను అరికట్టాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష

చండ్రుగొండ: అశ్వారావుపేట నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఎమ్మెల్యేపాటు చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట మండలాలకు చెందిన కాంగ్రెస్‌పార్టీ నాయకులు పొంగులేటి అనుచరులు భోజ్యానాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, పర్సా వెంకట్, బత్తుల అంజి, చిన్నశెట్టి యుగంధర్, జూపల్లి రమేష్‌లు సమావేశంలో పాల్గొన్నారు. ఆయా నాయకుల సమాచారం ప్రకారం.. చండ్రుగొండ మండలంలోని సీతాయిగూడెంలో ఉన్న వెంగళరాయసాగర్ మరమ్మతులపై మంత్రి ప్రధానంగా చర్చించారు. సత్వర చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ ఉన్నతధికారులకు ఆదేశించారు. నియోజకవర్గంలోని పెండింగ్ పనులపై చర్చించారు.



ఎమ్మెల్యే జారే, నాయకులతో సమావేశమైన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

పినపాక సమస్యలపై వినతి..

అశ్వాపురం: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో మంగళవారం రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణం సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మండలంలో పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మండలంలో ఉన్న మసీదులకు గృహ జ్యోతి పథకం వర్తింపజేయాలని, మండలంలో ఆధార్ కేంద్రాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ఆధార్ కేంద్రాల సంఖ్య పెంచాలని మంత్రి పొంగులేటికి విన్నవించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే.ఖదీర్, మండల నాయకులు ఓరుగంటి రమేష్, బూరెడ్డి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పొంగులేటికి సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే పాయం, కాంగ్రెస్ నాయకులు

'ఆయిల్‌ఫెడ్' అక్రమాలపై ఫిర్యాదు

అశ్వారావుపేటరూరల్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఆయిల్‌ఫెడ్‌లో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని మంగళవారం తెలంగాణ ఆయిల్‌ఫెడ్ అశ్వారావుపేట జోన్ సంఘం ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనంతరం రైతు సంఘం బాధ్యులు కొక్కెరపాటి పుల్లయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాలకుపైగా ఆయిల్‌పాం సాగు పేరుతో ఆయిల్‌ఫెడ్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించాలని కోరారు. అలాగే పామాయిల్ టన్ను ధర గిట్టుబాటు కాకపోవడంతో రైతులకు నష్టపోతున్నారని, తక్షణమే పామాయిల్ రైతులను ఆదుకోవాలని విన్నవించినట్లు తెలిపారు.

త్వరితగతిన పూర్తి చేయాలి



బూర్గంపాడు మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఆర్డీఓ మంగీలాల్



దరఖాస్తుల ఆన్‌లైన్‌ను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ రాజీవ్ కుమార్

బూర్గంపాడు: ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలని భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్ మండల అధికారులకు సూచించారు. బూర్గంపాడు మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న ఆన్‌లైన్ ప్రక్రియను మంగళవారం ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు మండలంలో ఎన్ని దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారని అధికారులను ప్రశ్నించారు. ఆన్‌లైన్ చేసిన దరఖాస్తుల వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియలో ఎలాంటి ఆలసత్వం వహించకుండా వేగవంతం చేయాలని, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ తిరుమలాచారి, ఎంపీడీఓ వివేక్‌రామ్, పీఆర్ ఏఈ వెంకటేశ్వరరావు, ఆర్ఐలు ముత్తయ్య, నర్సింహారావు తదితరులున్నారు.

14లోపు ఆన్‌లైన్ చేయాలి

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఆరు గ్యారెంటీ పథకాలకు సంబంధించిన ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ఈ నెల 14వ తేదీలోపు పూర్తి చేసేందుకు కృషి చేయాలని డీఎల్‌పీఓ రాజీవ్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో నిర్వహిస్తున్న దరఖాస్తుల ఆన్‌లైన్ విధానాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు అశ్వారావుపేట మండలానికి సంబంధించిన దరఖాస్తుల్లో 8వేల దరఖాస్తులను ఆన్‌లైన్ పూర్తి చేశారని, మిగిలిన వాటిని కూడా వేగవంతం చేస్తున్నామని అన్నారు. ఆన్‌లైన్ ప్రక్రియను తప్పులు లేకుండా సక్రమంగా పూర్తి చేసేలా ఆదేశించామని, అవసరమైతే డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించుకునేలా చర్యలు చేపట్టుతున్నామని చెప్పారు. అనంతరం మండలంలోని నందిపాడు, అచ్యుతాపురం, అశ్వారావుపేట గ్రామ పంచాయతీల్లో పర్యటించి, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీఓ జి.శ్రీనివాసరావు, ఎంపీఓ సీతారామ రాజు, ఈఓ జి.హరికృష్ణ, కార్యదర్శులు ఉన్నారు.

అధికారుల జట్టుకు అభినందన

మణుగూరురూరల్: ఈ నెల 5వ తేదీ నుండి 7వ తేదీ వరకు జరిగిన అధికారుల ఇంటర్ రీజనల్ క్రికెట్ టోర్నీలో ప్రతిభ కనబర్చి రన్నర్‌గా నిలిచిన కొత్తగూడెం-మణుగూరు ఏరియా రీజియన్ జట్టు సభ్యులను మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ మంగళవారం జీఎం కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు జరిగిన అధికారుల ఇంటర్ రీజనల్ క్రికెట్ టోర్నీలో 11 ఏరియాలకు సంబంధించి రామగుండం, బెల్లంపల్లి, కొత్తగూడెం, కార్పొరేట్ రీజియన్ జట్లు పోటీలో పాల్గొనగా.. ఫైనల్ మ్యాచ్‌కు బెల్లంపల్లి రీజియన్, కొత్తగూడెం-మణుగూరు రీజియన్ జట్టు చేరుకున్నాయి. బెల్లంపల్లి జట్టు విన్నర్‌గా, కొత్తగూడెం-మణుగూరు జట్టు విన్నర్‌గా నిలిచాయి. కొత్తగూడెం-మణుగూరు రీజియన్ జట్టు కెప్టెన్ అవినాష్(మణుగూరు ఓసీ డీవైపీఎం) 46బంతుల్లో 65 పరుగులు సాధించడం పట్ల జీఎం ప్రత్యేకంగా అభినందించారు. అలాగే జట్టు సభ్యులకు సైతం అభినందనలు తెలిపారు. క్రీడలు మానసిక వికాసానికి, పట్టుదలకు, నైపుణ్యతకు గొప్ప నిదర్శనాలు అన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటూ జీఎం వీసం కృష్ణయ్య, ఏజీఎం(సివిల్) వెంకటేశ్వర్లు, మణుగూరు ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీనివాస చారి, కేపీయూజీ ఏజెంట్ వీరభద్రం, డీజీఎం (పర్సనల్) ఎస్.రమేష్, ఏరియా సర్వే అధికారి శ్రీనివాసులు, అధికారుల జట్టు సభ్యులు సర్వర్ నబీ, పవన్, విక్రమ్, భరత్, బిందుసాగర్, సాయిల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



అధికారుల జట్టు సభ్యులను అభినందిస్తున్న ఏరియా జీఎం రామచందర్

ప్రమాదకరంగా కల్వర్టు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ సమీపంలో ఊరవాయి కాలువ వద్ద మణుగూరు-కొత్తగూడెం ప్రధాన రహదారి వెంబడి కల్వర్టు ఎటువంటి రక్షణ లేకుండా ప్రమాదకరంగా ఉంది. ప్రధాన రహదారి గుంతలు గుంతలుగా ఉండి అధ్వానంగా ఉండటంతో కల్వర్టు కూడా ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం కల్వర్టు వద్ద హెచ్చరిక బోర్డులు కూడా లేవు. మేడారం జాతర సమీపిస్తుండటంతో వాహనాల రద్దీ క్రమంగా అధికమవుతుంది. ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా కల్వర్టుకు ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు